# వంశీ

-కోపూరి పుష్పాదేవి

ఆ రోజు ఇంట్లో శ్మశాన నిశ్శబ్దం పేరుకుంది. ఎవరూ ఎవరితోనూ మాట్లాడడంలేదు. మధుకి అయితే చచ్చిపోవాలని వుంది. అతను కలలోకూడా ఊహించలేదు ఇలాంటి రిపోర్టు వస్తుందని. సంతాన లేమికి అతనే కారణం. భార్యకు మొహమెలా చూపించాలో అతనికి అర్థంకాలేదు.

తలుపులు గడియ బిగించుకుని, మంచమెక్కి దిండులో మొహం దాచుకున్నాడు. అతని కంటి నుండి చుక్క నీరు కారడంలేదు. కానీ మనసు వెక్కివెక్కి ఏడుస్తోంది. హృదయం గుండెలు బాదుకుంటోంది.

"ఏమండీ! తలుపు తియ్యండి. కొద్దిగా అన్నం తినండి. లేదంటే కాఫీ తీసుకువస్తాను" రేవతి తలుపు కొడుతూనే వుంది. అప్పటికి అది నాలుగోసారి ఆమె తలుపు కొట్టడం. మధ్యాహ్నం రెండుగంటలకు హాస్పిటల్ నుండి రిపోర్టు తెస్తూనే దాన్ని భార్య చేతికి ఇచ్చి గదిలోకి వెళ్లి ధడాలున తలుపు వేసుకున్నాడు. ఇప్పుడు సాయంత్రం ఆరయింది. భార్యే కాదు, తల్లి, వదినలు, తండ్రి ఎవరు పిలిచినా అతడు పలకడంలేదు, తలుపు తీయడంలేదు. కాకపోతే కిటికీలోంచి కనిపిస్తున్నాడు. మంచంమీద అటు తిరిగి పడుకున్నాడు.

***

చలపతిరావుగారిది ఉమ్మడి కుటుంబం. ముగ్గురు కొడుకులు, ఒక్క కూతురు. అందరికీ పెళ్లిళ్లు అయిపోయాయి. వారిది పల్లెటూరు. ఇప్పుడిప్పుడే వృద్ధిలోకి వస్తున్నది. పెద్దకొడుకు మోహన్ తండ్రితోపాటు వ్యవసాయం చేస్తాడు. రెండో కొడుకు రాజుకి దగ్గరలోని సిటీలో ఉద్యోగం. రోజూ వెళ్లి వస్తుంటాడు. మూడవ కొడుకు మధు. ఆ ఊరి హైస్కూల్లో టీచర్. కూతురు ఉమ భర్త ఉద్యోగరీత్యా అమరావతిలో వుంటోంది.

మధుకి తప్ప అందరికీ ఇద్దరేసి పిల్లలు. మధుకు కూడా పెళ్లయి నాలుగేళ్లు దాటుతున్నా భార్య రేవతి ఇంకా గర్భం ధరించకపోవడంతో అత్తగారు ధనలక్ష్మికి ఆరాటం ఎక్కువైంది. పోరి పోరి కొడుకునూ, కోడలినీ హాస్పిటల్‌కు పంపింది. ఈ వేళ ఆ రిపోర్టు వచ్చి ఇల్లంతా అల్లకల్లోలం చేసింది.ఎలాగైతేనేం రాత్రి తొమ్మిది గంటలకు మధు తలుపు తీసాడు. అందరూ హమ్మయ్య అంటూ ఊపిరి పీల్చుకున్నారు. కానీ ఎవరూ అతడ్ని మాట్లాడించలేదు. రేవతి కంచంలో అన్నం కలుపుకుని గదిలోకి తీసుకువచ్చింది. భర్తను బతిమాలి, బుజ్జగించి ముద్దలు కలిపి నోట్లో పెట్టింది.

"నీకు చాలా అన్యాయం జరిగిపోయింది బుజ్జీ" అంటూ భార్య వడిలో మొహం దాచుకుని బావురుమన్నాడు మధు.

ఏకాంతంలో వున్నప్పుడు భార్యను అలాగే పిలుస్తాడతను. మధ్యాహ్నం నుండి మనసులో ఘనీభవించిన దుఃఖం ద్రవీభూతమై అప్పుడు వరదలా పోటెత్తింది. కాసేపు అతడ్ని అలాగే ఏడవనిచ్చిన రేవతి అతని ముఖాన్ని చేతుల్లోకి తీసుకుని గుండెలకు హత్తుకుంది.

"నాకసలు పిల్లలే అక్కర్లేదు. బంగారుకొండలాంటి నువ్వున్నావు చాలు. నాకు నువ్వూ నీకు నేనూ...మనకింక ఎవ్వరూ వద్దు" అతని ఎదలో తన మొహం దాచుకుంది రేవతి. "ఇంకెప్పుడైనా నువ్విలా బాధపడితే నామీద ఒట్టే" అంది.

"పోనీ నువ్వు మరో పెళ్లి చేసుకోరా బుజ్జీ. నేను ఆనందంగా విడాకులిస్తాను" అన్నాడు మధు.

"సినిమా డైలాగులు చెప్పకు" అతని నోటి మీద ఫట్‌మని కొట్టింది రేవతి.

"అదికాదురా బుజ్జీ... అన్నయ్యలకూ, అక్కకూ అందరికీ పిల్లలున్నారు. మనక్కూడా ఉంటే బావుంటుంది. పోనీ నువ్వు ఐవీఎఫ్‌గానీ, ఆర్టిఫిషియల్ ఇన్‌సెమినేషన్ అనీ ఏవేవో పద్ధతులున్నాయిట...వాటి ద్వారా...?"

"నాకు అవేవీ వద్దు. అసలు పిల్లలే వద్దు. మీ అన్నయ్యల పిల్లలు మన పిల్లలు కాదా?"

"అలా కాదు. మనకూ సొంతంగా మన బిడ్డ...?"

"ఏమీవద్దు. ముందు ప్రశాంతంగా నిద్రపోండి. నాకు నిద్ర వస్తోంది" అటు తిరిగి నిద్ర నటించింది రేవతి.

***

ఎవరి పిల్లలనన్నా పెంచుకొమ్మని మధుకి సలహా ఇచ్చారు అతని తల్లీదండ్రీ. అన్నలూ, అక్కా ఇస్తామని పోటీ పడ్డారు. కానీ మధుకు అలా ఇష్టంలేదు. పోనీ దూరపు బంధువుల్లో ఎవరి పిల్లలనైనా చూసి పెంచుకోండి వత్తిడి పెట్టారు ధనలక్ష్మి, చలపతిరావులు.

"బంధువుల పిల్లలు వద్దు. ఏదైనా అనాధాశ్రమం నుండి వచ్చిన అమ్మాయినో, అబ్బాయినో తీసుకువచ్చి పెంచుకుందాం. ఒక అనాధకు మంచి జీవితం ఇచ్చినట్లు వుంటుంది" అన్నది రేవతి.

"వాళ్ల కులమేమిటో, మతమేమిటో మనకు తెలియదు. వాళ్లది ఎటువంటి జన్మో అంతకన్నా తెలియదు. అటువంటి పిల్లలు వద్దు" ఏకకంఠంతో అన్నారు అత్తమామలు.

'బాగా అయింది...' అనుకున్నారు తోటికోడలిద్దరూ. తమ పిల్లల్ని వద్దన్నారని వాళ్లకి చాలా ఉక్రోషంగా ఉంది.

"అలా కాదు మామయ్యగారూ. తల్లిదండ్రులు చేసిన తప్పుకి బిడ్డలు ఎలా బాధ్యులవు

తారు? పసిబిడ్డలు దేవుడితో సమానం అంటారు కదా. ఇక మనం సవ్యంగా పెంచితే వాడూ సవ్యంగానే పెరుగుతాడు'' అన్నది రేవతి సపోర్టు కోసం భర్తవేపుచూస్తూ.

"నిజమేకదా నాన్నా. పసిబిడ్డలో కల్మషం ఏం వుంటుంది? ఏ కులమైనా, ఏ మతమైనా అందరికీ ఆకలిదప్పులు ఒక్కటే. అన్నదానం, విద్యాదానం చాలా గొప్పవంటారు. అంతకన్నా బతుకు దానం ఇంకా గొప్ప పనే కదా. రేవతి అన్నట్లు అనాథ పిల్లవాడ్ని పెంచుకుంటాం'' అన్నాడు మధు.

తల్లిదండ్రులూ, ఇద్దరు అన్నయ్యలూ, అక్కవదినలు అందరూ వద్దని ఎన్నిరకాలుగా చెప్పినా అతను వినలేదు. అందరినీ ఎదిరించి అయినాసరే భార్య మాట చెల్లించి ఆమెకు తన వల్ల జరిగిన అన్యాయం నుంచి కొంతవరకైనా విముక్తి పొందాలనుకున్నాడు మధు.

అలా ఆ ఇంటిలోకి అడుగుపెట్టాడు వంశీ. ఆరేళ్లవాడు, కళగల ముఖం, మంచి ఛాయ, వత్తయిన జుట్టు వాడి సొంతం. మొత్తానికి నెమలిపింఛంలేని బాలకృష్ణునిలాగా ఉంటాడు. తమ పిల్లలకన్నా చురుకుగా, హుషారుగా ఉన్నవాడిని చూసి రేవతి తోడికోడళ్లయిన గీత, ప్రభావతులకు కడుపుమంట ఎక్కువయింది. తోడికోడళ్ల మూతి విరుపులు, ముఖం చిట్లింపులు రేవతి పట్టించుకోలేదు.

★★★

ఆ రోజు ధనలక్ష్మి ఒకే కంచంలో అన్నం కలిపి ఇద్దరు మనవరాళ్లకు, ఇద్దరు మనవలకు తినిపిస్తోంది కథ చెప్తూ. వంశీకి కూడా కథలంటే ఎంత ఇష్టమో. శ్రద్ధగా ఉంటాడు. తరువాత మనం చెప్పినదానికి తను మరి కొంత కలిపి




ఇంకా అందంగా చెప్తాడు. నానమ్మ చెప్పే కథ వింటూ వాడూ నోరు తెరిచాడు. పొరపాటున ఆమె కూడా వాడి నోట్లో ఒక ముద్ద పెట్టింది. అది చూసిన గీత భగ్గుమంది.

"ఆ దిక్కుమాలిన వాడి ఎంగిలి మా పిల్లలు తినాలా?" అంటూ గబగబా వచ్చి తన పిల్లలిద్దరినీ లాక్కుపోయింది. వెంటనే ప్రభావతి అదే పని చేసింది. అదంతా చూసి రేవతి స్థాణువై పోయింది.

"ఛీ..వెధవ నీ గురించి పచ్చని సంసారంలో గొడవలు మొదలవుతున్నాయి. ఇంకెప్పుడూ నా దగ్గరకు రాకు..." వంశీని చీదరించుకుని ధనలక్ష్మి కంచంలోని అన్నమంతా కాలువలో పారబోసింది. అసలు గొడవెందుకు అయిందో, తననెందుకు తిట్టారో అర్థంకాని వంశీ బిక్కమొహం వేసాడు. వాడి మొహం చూసి హృదయం ద్రవించిన రేవతి వాడిని ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని తమ గదిలోకి వెళ్లిపోయింది.

★★★






## టెలక్ట్రోస్కోప్

లండన్ నుంచి న్యూయార్క్ దాకా అటూ ఇటూ మనుష్యులు 5570 కి.మీ దూరం ప్రయాణించేలా అట్లాంటిక్ మహాసముద్రంలో ఒక సొరంగం త్రవ్వాలని వందేళ్లనాడు పని ప్రారంభించి ఆదిలోనే వదిలేసారుట. అయితే అలెగ్జాండర్ స్టాన్‌హోప్ అనే ఇంజనీర్ ఇటీవల ఒక టెలక్ట్రోస్కోప్‌ని నిర్మించి రెండ నగరాల మధ్య మనుష్యులు ఒకరినొకరు చూసుకునేలా చేసాడు. లండన్‌లోని టవర్ బ్రిడ్జి దగ్గర నిలబడి న్యూయార్క్‌లోని బ్రూక్లిన్ బ్రిడ్జి దగ్గర మనుషుల్ని షేక్‌హ్యాండ్ ఇవ్వడం మినహా అంత దగ్గరగా నిలబడి విష్ చేసుకోవచ్చు. బర్త్‌డే గ్రీటింగ్స్ చెప్పుకోవచ్చు. తన తాతగారి పాత డైరీలో ఆయన కలలుగా ఉండిపోయిన విషయాలు చదివాక స్టాన్‌హోప్‌కి టెలక్ట్రోస్కోప్‌ను తయారు చేయాలన్న ఆలోచన వచ్చిందిట.

-తటవర్తి

వంశీని కాన్వెంట్‌లో చేర్చాలనుకున్నాడు మధు. ఆ ఊళ్లో ఉన్నది ఒక్కటే మంచి కాన్వెంట్. అది మూడు కిలోమీటర్ల దూరంలో వుంది. పిల్లలు నలుగురూ ఒకే రిక్షాలో ఆ కాన్వెంటుకు వెళ్తారు. వంశీ ఆ రిక్షా ఎక్కకూడదట. వారితో వాదనలెందుకని వేరే రిక్షా మాట్లాడాడు మధు. ఆ సంవత్సరం ఎండాకాలం సెలవుల్లో పిల్లలు నలుగురూ మేనత్త ఇంటికి బయలుదేరారు. ఆమె వంశీని కూడా పంపమని మాట వరసకు కూడా అనలేదు.

చైత్రమాసం ప్రవేశించింది. ఎండలు చిరచిరలాడుతున్నాయి. ఆ రోజు చలపతిరావుగారి తమ్ముడి కూతురి పెళ్లి. వీళ్ల వీధి చివరే వాళ్ల ఇల్లు. ఇంట్లో అందరూ అక్కడికే భోజనానికి వెళ్లారు. మోహన్ అప్పుడే పొలం నుండి వచ్చాడు. బట్టలు మార్చుకుని తనూ భోజనానికి వెళ్దామనుకుని బట్టలకోసం బీరువా వద్దకు వెళ్లాడు. అతనికి హఠాత్తుగా కళ్లు తిరిగాయి. శరీరం అంతా ఒక్కసారిగా వణికినట్లయింది. గుండెల్లో నొప్పి మొదలయింది. అది క్షణక్షణానికి పెరిగిపోతోంది. గుండెనెవరో గట్టిగా అదిమినట్టు, గుండెలమీద పదికిలోల బరువును పెట్టినట్లు రకరకాల బాధ. ఒళ్లంతా ధారాపాతంగా చెమట్లు. ఎడమ భుజమూ, చెయ్యి విపరీతంగా నొప్పి, కడుపులో తిప్పుతోంది. వాంతి వచ్చేట్లు ఉంది. అతనికి అర్థమైపోయింది తనకు మళ్లీ గుండెపోటు వచ్చిందని.

అరే... సమయానికి ఇంట్లో ఎవరూలేరే... ముందు భోజనం చేసివచ్చిన పిల్లలు వాకిట్లో ఆడుకుంటున్నారు. భార్యకి కబురు చేద్దామని మోహన్ శక్తినంతా కూడదీసుకుని తన పిల్లల్ని పిలిచాడు. ఆటల ధ్యాసలో వున్నవాళ్లు పలకలేదు. మరోసారి ఓపిక చేసుకుని తమ్ముడి పిల్లలను పిలిచాడు. వాళ్లూ పలకలేదు. 'ఇక తన పని అయిపోయింది. తన అవస్థను గమనించే వాళ్లు ఎవరూలేరు. అందరూ ఉండి కూడా తను దిక్కులేని చావు చావబోతున్నాడు. తనవాళ్లు వచ్చేసరికి తను శవంగా మిగులుతాడేమో...'' అతనికి అమిత దుఃఖం కలిగింది. ఏడుస్తూ సోఫాలో వాలిపోయాడు.

అప్పుడు వచ్చాడు వంశీ "ఏమిటి పెదనాన్నా పిలిచారు" అంటూ.

మోహన్ తనకు గుండెల్లో నొప్పిగా ఉందని సైగ చేసాడు. అప్పటి అతని పరిస్థితి చూసి వంశీకి చాలా భయమేసింది. వాడికి గీత ఎప్పుడో అన్న మాట గుర్తుకు వచ్చింది 'గుండెనొప్పి వచ్చినప్పుడు నాలుక కింద టాబ్లెట్ పెట్టుకోవాలని'. గబగా సొరుగులాగి మోహన్ మందుల బ్యాగ్ తీసుకువచ్చాడు. అప్పటివరకూ కంగారులో మోహన్‌కు కూడా గుర్తుకు రాలేదు సార్బిట్రేట్ టాబ్లెట్ నాలుక కింద పెట్టుకోవాలని.

వంశీ మందుల బ్యాగ్ తేగానే ఒక టాబ్లెట్ తీసి నాలుక కింద పెట్టుకున్నాడు. అతనికి కళ్లు మూతలుపడ్డాయి. వంశీ చటుక్కున 108కి ఫోన్ చేసాడు 'మా పెదనాన్నగారికి గుండెల్లో నొప్పి వచ్చింది త్వరగా రండి' అంటూ అడ్రస్ చెప్పాడు. పరుగెత్తుకుంటూ వెళ్లి గీతనూ, ప్రభావతిని పిల్చుకుని వచ్చాడు. వాళ్లు హడావుడిగా వచ్చేసరికి గుమ్మంలోకి 108 వ్యాన్ వచ్చేసింది. క్షణాలమీద మోహన్‌ను ఆసుపత్రికి తీసుకువెళ్లారు. 'మరో అయిదునిముషాలు లేటయినా మోహన్ ప్రాణాలు దక్కేవికావు' ఇది డాక్టర్ల మాట. హాస్పిటల్ రూమ్‌లో బెడ్‌మీద మోహన్ ప్రశాంతంగా నిద్రపోతున్నాడు. అందరి ప్రాణాలు కుదుటపడ్డాయి. పెద్ద గండం గడిచి మోహన్ ప్రాణాలు దక్కాయి. గీత వంశీని వడిలోకి లాక్కుని వాడి ఒళ్లంతా ముద్దులతో నింపేసింది.

"ఒరే వంశీ... నిన్ను అనాథవని ఛీత్కరించాను. కానీ ఇప్పుడు నేను అనాథ కాకుండా నువ్వే కాపాడావురా..." అన్నది కన్నీళ్లు కారుస్తూ.

ఆమె ఏడుస్తుంటే అందరి మనసుల్లోనూ ఏదో పశ్చాత్తాపభావం కదలాడింది.

★